# చిక్కు

ఈ మధ్యనేమిటో ప్రతిమొగాడు సెకండ్ సెటప్ చేసుకుంటున్నాడు! ఆయనకు 'గిరిజ'తో సంబంధం వున్నట్టు ఇసుమంతైనా మొదట్లోనే తెలిస్తే, నేనాయన్ని నామెళ్లో మంగళసూత్రం కట్టనివ్వకనేపోదును! ప్రస్తుతపు మా ఆయన నాకు ఆయన అవకనే పోదురు! నాకింకే ఆయన వచ్చేవారో? అంతా ఖర్మ! అందుకనే కాబోలు పెళ్లిళ్లు సత్యలోకంలోనే అయిపోయాయంటారు. సృష్ట్యాదిలోనే బ్రహ్మ 'ఫలానా వాళ్లిద్దరూ దంపతులౌతారని' నొసట రాసి పారేస్తాట్ట! నేను ఇటీవలనే కాపురానికి వచ్చాను. వచ్చిన కొత్తలోనైనా ఆయన సకాలానికి కొంప చేరుకోవాలంటారా? అబ్బే! అదేంలేదు. నే వచ్చింది లగాయతు రాత్రి తొమ్మిదికి తక్కువకాదు రోజూ ఆయన ఇంటికి వచ్చేసరికి, "ఏమండీ ఇంతాలస్యం?" అంటే

"గిరిజావాళ్ళింట్లో ఏవో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశాను" అంటారు. "వాళ్లింట్లో మల్టీ ఛానల్స్ వచ్చేకలర్ టీవీ ఉంది. డాబామీద డిష్ ఏంటెనా ఉంది. ఏవో ప్రోగ్రాములు చూస్తుంటే టైమ్ తెలియలేదు." అంటారు. పైగా! ఆయన అలా సమాధానం చెప్పినప్పుడు ఈ గిరిజ ఎవర్తీ ఏంటీ? అని నేనాయన్ని నిలదీయొద్దూ? కానీ తొందరపాటు కూడదనే మానేశాను. మెల్లగా ఇరుగుపొరుగువారిని నాలుగు విషయాలు అడిగి, అన్నీ క్షుణ్ణంగా పరిశీలించనిదే ఎలాంటి నిర్ణయానికీ రాకూడదు.

ఏమో! ఒక వేళ గాని ఈ 'గిరిజ' ఆయనగారికి ఏవేలు విడిచిన పినతల్లి కూతురో, పినతండ్రి కూతురో అయితే? అప్పుడు చెల్లెలి వరస కదూ? అన్నా చెల్లెళ్లని అనుమానిస్తే పాతకం చుట్టుకోదూ? అయ్యో నా మతి మండ! ఈ 'గిరిజ' ఆయనకి నిజంగా చెల్లెలి వరసే అయితే మా పెళ్లికి రాదూ? ఒకవేళ ఏ కారణం వల్లనైనా రాలేకపోతే మా ఆయనైనా చెప్పి ఉండరూ? "మా చెల్లెలు గిరిజ మన వివాహానికి రావాలని ఎంతగానో ప్రయత్నించింది. కానీ రాలేకపోయింది" అని, లేదా ఈపాటికి ఓ మాటు వాళ్లింటికి నన్ను పరిచయం

వెయ్యటానికైనా తీసికెళ్ళి ఉందురు లేదా 'గిరిజ'నైనా మా ఇంటికి తీసికొచ్చి ఉందురు! అంచేత గిరిజ ఏవిధంగానూ మా ఆయనకు చెల్లెలు కాదన్నది ఖాయం.

మా ఆయన ఆఫీసుకెళ్లేక ఈ గిరిజ గురించి ఆరాతీసి, దానింటికెళ్లి- "నీకిదేమైనా బావుందా? కొత్తగా పెళ్లైన మా కాపురంలో చిచ్చుపెడతావా?" అని కడిగేయాలనిపించింది. దానింటిముందు ఆగాను. దాని గుమ్మం ఎక్కేందుకు నాక్కొంచెం కాళ్లు వణాకాయి. గుండెలు కొట్టుకున్నాయి. ఏమంటుందో? "నేనేం నా దగ్గరికి రమ్మన్నానా మీ ఆయన్ని? ఆయనకి నామీద మోజు ఉండబట్టే వొస్తున్నాడు. నువ్వెవర్తివి నన్నడగడానికి? చేతనైతే మీ ఆయన్ని నువ్వు అదుపులో పెట్టుకో"' అనంటే? సరే ఏమైతే అయింది అని గుమ్మంలో అడుగుపెట్టాను. తలుపు తీసి వున్నా గడియని చప్పుడు చేశాను. ఎక్కడ చూసినా దండేన్ని ఆరవేసిన పంట్లాలు, చొక్కాలు చీరలవంటి లుంగీలు! ఎక్కడా ఆడవాళ్ల జాడేలేదు!

ఒకాయన లోపల్నుంచి వచ్చాడు. "ఎవరు కావాలి మేడమ్?" అన్నాడు. మావారిపేరు చెప్పి- "గిరిజ ఎవరో తెలుసుకుందామని వచ్చాను" అన్నాను. "గిరిజంటే నేనేనండీ! నా పేరు గిరిజాపతి, నాస్నేహితులందరూ నన్ను ముద్దుగా గిరిజా అని పిలుస్తారు" అన్నాడాయన. నేను మరి కిక్కురుమనకుండా, నోట్లో కొంగుముడి కుక్కుకుని గుమ్మం దిగిపోయాను. "అయ్యయ్యో! అప్పుడే వెళ్ళిపోతున్నారా? కొంచెం టీ అయినా తాగి వెళ్లండి!" అని ఆయన అంటున్నా- నేను మరథాన్‌రేస్‌లో పాల్గొన్న పీటీ ఉషని అయిపోయాను!

15-5-1997

ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక